# వందేళ్ళూ ఇలా జరగాలి

**—అనంతరాయలు**

ఎదురుగా ఉన్న పుస్తకాన్ని తెరిచింది సీత.

ఏ ప్రయత్నమూ లేకుండానే పేజీలు వాటంతట అవే తిరుగుతున్నాయి. కాని, సీత కళ్ళకు ఏమీ కనిపించటం లేదు. మనస్సు వేరే దిక్కున పరిగెడుతూంది. ఏదో గుర్తొచ్చిన దానిలా మంచం మీద నుండి ఉన్నట్లుగా లేచి తన గది తలుపులు గడియ బిగించి, గది నిర్మానుష్య మయినా, నాలుగు వైపులా పరికించి 'అమ్మయ్య' అనుకుని, జాకెట్లో భద్రంగా దాచుకొన్న నలిగిపోయిన ఉత్తరం మడతలు సరిచేసి దాన్ని పుస్తకం మధ్యలో దాచింది.

హాల్లో ఉన్న గోడ గడియారం నేనున్నానంటూ కొట్టిన గంట, సమయం రాత్రి తొమ్మిదిన్నర గంటలని సూచించగానే, అన్నా వదినా సినిమా నుంచి తిరిగి వచ్చేటప్పటికి మరో అరగంట పైనే పడుతుందని అనుకుంది సీత. అయినా, 'సినిమాకు తయారవ్వాలనే తొందరలో బాత్‌రూమ్‌లో ఉన్న, తనను వదిన తొందరించకపోతే, ఆ ఉత్తరాన్ని అక్కడే చదివి ఉండేది సీత. తను చదవటం మొదలెడితే మరో 'మారయి' ఉండేది ఇప్పుడు.

అయితే ఒకటి. . 'సీత' ఆ ఉత్తరాన్ని ఎన్ని సార్లు చదువుకుందో ఆమెకే తెలియదు. ప్రతి సారి ఏదో కొత్తదనం దానిలో తొంగి చూస్తూ ఉంటుంది. వీలయినప్పుడల్లా ఉత్తరాన్ని మరీ మరీ తిరిగి చూడటం పాత సంగతే అయినా, ఈ అర్ధరాత్రి సమయం పరీక్ష లొక వైపు ముంచు కొస్తున్నా, మరి ఇంకో సారి చదవాలనుకోవటంలో ఒక బలవత్తరమైన కారణముంది. అన్నా, వదినా రాకముందే ఏదో ఒకటి జరగాలి.

ఆ సాయంత్రం లైబ్రరీ నిశ్శబ్దంగా ఉంది: ఒకరి గురించి మరొకరు పట్టించుకునే స్థితిలో లేరు, పరీక్షలు కాబోవటంతో. కాని, రవి మునుసిగ్గుతో, బెరుకు బెరుగ్గా, అస్పష్టంగానే అయినా అర్థమయేటట్లు మెల్లగా, గుస గుసలతో చెప్పిన విషయం ... నిజం—అతడు మాట్లాడింది కొన్ని క్షణాలు. కాని ఆలోచనల తుఫానులు వెంటనే మనస్సుని ఒడ్డుకు చేరుకోకుండా చూశాయి. అంతంత మాత్రం అప్పటివరకు సాగుతున్న చదువు చెట్టెక్కేసింది. ఇంటికి చేరిన దగ్గరి నుంచి అందువల్లనే ఆ ఉత్తరాన్ని మరోసారి చదవాలనుకున్నా చిత్రం! వీలే కాలేదు సీతకు అప్పటివరకూ.

ఉత్తరంలో వేసిన తారీకు చూసింది. రవి వ్రాసిన ఉత్తరం తనను చేరి బహుశా పదిహేను రోజులే అయినా, ఎన్నో యుగాలు మారినట్లయింది. దాని తరవాత కాలం నత్తగుల్ల వేగంతో సాగింది అన్నాళ్ళూను. క్షణం భారంగా గడుస్తున్నా, సీతకు ఏ పని చేస్తున్నా, ఏ మాలోచిస్తూ ఉన్నా, ఆ ఉత్తరం సంగతి మినహాయించి మరో ధ్యాసే లేకపోయింది. నిద్ర దూరంగా పారి పోయింది. ఆకలంటే మరిచేపోయింది. అప్రమత్తతకు మరో పేరయినా, వరధ్యానం ఆవరించిన సీతను తమాషా పట్టించడానికి చిన్న తమ్ముడికి భలే అవకాశం చిక్కింది. సమయం దొరికితే జోకు వేసి గాని వాడు మరీ కదలడు.

రాబోయే పరీక్షల గురించి బెంగ వల్ల పిల్ల బొత్తిగా తినటం మానివేసిం దనుకున్న వదినకు కాని, ప్రతి విషయాన్ని తేలికగా తీసుకునే పెద్దన్నయ్యకు కాని, కొంటె చిన్నన్నకు కాని అసలు విషయం తెలియనందుకు ఆనందించింది సీత. ఎవరి కయినా చెప్పి తన సమస్యను ఇతరులతో పంచుకుందా మనే ఆశ ఉన్నా పక్క ఇంటి సరోజ క్లాసుమేటే కాక ఆప్త మిత్రురాలే అయినా, ఆమెకుకూడా చెప్పే ధైర్యం లేదు సీతకు. ఆట పట్టించటమే కాకుండా దాని నోట్లో నువ్వుగింజ నానదు కాబట్టి, సీతకు మరో మార్గం కనిపించ లేదు.

అదొక విషమ ఘట్టం. ఎటూ ఆలోచించలేని స్థితి. ఒక నిర్ణయానికి రాలేని పరిస్థితి. కాని, తప్పదు. ఇంకెంత కాలమో వాయిదా వేసే ఓపిక పట్టగల సమయం మహా మిగిలితే మరో అరగంటకు మించదు. సినిమా నుంచి వాళ్ళిద్దరు రాకముందే ఆ ఉత్తరం పోస్టులో పడాలి. పొద్దున్న పోస్టు తీసే సమయం లోపల దాన్ని వేయాలంటే వీలు కాని పని. చీకటయినా, భయం వేసినా పోస్టు చెయ్యటం తప్పదు. తన రవి—ఛీ ఛీ! అప్పుడేనా? రవి. . .కాదు, తన రవే! నిర్ణయించిన గడువు లోపల ఆ ఉత్తరం అతనికి చేరాలి. ఉత్తరం చివరలో ఉన్న అడ్రెసు చూసి 'లోకల్ పోస్టే కదా. తప్పకుండా రేపు సాయంత్రానికి అందుతుందిలే' అనుకుంది సీత. కిందనుంచి చూపులు ఉత్తరం ప్రారంభానికి మళ్ళాయి తన ప్రయత్నం లేకుండానే.

సంబోధన లేదు. లేకుండానే ఉత్తరం ప్రారంభమయింది. 'ప్రియమైన నా సీతకు' అని లేకపోయినా, 'మై డియర్ సీతా' అనికూడా వ్రాయలేదేం అనుకుంది ఎప్పుడూ లాగానే.

రవి ఉత్తరాన్ని తనంతట తనే చదువుతున్నట్లు సినిమాలో చూపించే విధంగా ఫీలయింది సీత.

"సారీ. . . ( ఛీ ఛీ! ఏమిటో. . . ఇలానా ముందుగానే?' అనుకుంది, వెంటనే సీత మనస్సులో) ఎలా ప్రారంభించాలో తెలియదు. అంతకన్నా మరీ ఘోరం ఏం రాయాలో మరీ తెలియదు. నాకు తెలుసు—ఈ ఉత్తరం మిమ్మల్నిఆశ్చర్యంలో ముంచేయటమే కాకుండా నా గురించి మీ మనస్సులో సద్భావ మేదైనా ఉంటే, అది దీనితో తుడిచి పెట్టుకు పోతుందని. అయినా ముందుకు సాగాలి నేను. తప్పదు ఎందుకంటారేమో మీరు.

ఒక విధంగా ఒకరి పేరు మరొకరికి తెలియటం మినహాయించి, కనీసం ఒక్కసారయినా మాట్లాడయినా ఎరగని మన మధ్య ఉత్తరంతో చెప్పవలసిన సంగతు లేముంటాయా అని కదూ మీ ఊహ? అవును, నిజమే. సాన్నిహిత్యము ఉంటే ఉత్తరంలో వ్రాస్తున్న ఈ నాలుగు ముక్కలు నోటితోనే చెప్పి ఉండేవాడిని.

అందువల్ల వ్రాయటం తప్పలేదు, ధైర్యం చాలకున్నా. తప్పుగా మాత్రం వ న్నర్థం చేసుకోకండేం.

ఏదో ఒక తీయని కలగా ఇంతవరకు కాలేజి జీవితం గడిపేశాం మనమంతా. నిజ జీవితంలో అడుగు పెట్టబోయే ముందు మనం కొన్ని సమస్యల్ని ఎదుర్కోవటం తప్పదు మరి. అందులోనూ అన్నిటికంటే ముఖ్యమయింది వివాహ మనేది అని నే నంటే ఒప్పుకుంటారా మీరు?

దాని వల్లనే అనుకుంటా—ఇన్ని రోజులు మనసులో అణుచుకున్న భావాలు, అమాంతంగా పైకొచ్చి నన్ను మీ దగ్గరి నుంచి లాక్కుపోతాయేమో నని భయంగా ఉంది.

ఇప్పుడే మీరు నన్ను అపార్థం చేసుకోకుండా ఉండవలసింది. 'పరిచయ' మనే పదానికి అర్థం ఏదయినా, మూడు సంవత్సరాలుగా చూస్తుండే మిమ్మల్ని పరిచయస్థురాలుగానే తీసుకుంటాను. మాట్లాడించాలన్నా ధైర్యమే కాకుండా అవకాశం లేనివాడిని. అయినా, మీ రేదో నాకు దగ్గర కావాలని ఊహించాను. కలలు కన్నాను. ఇదమిత్థంగా తేల్చి చెప్పలేని ఆప్యాయతను, మమకారాన్ని పెంచుకున్నాను. బహుశా అవన్నీ ఈ నాడు నన్ను మిమ్మల్ని ఓ విషయం అడగమని గొడవ చేస్తున్నాయి.

అందుకనే అడుగుతున్నాను. 'మీరు నన్ను పెళ్ళి చేసుకొనటానికి ఒప్పుకుంటారా?' అని. ముందు మీ అంగీకారం ముఖ్యం. జరగవలసిన తక్కినవన్నీ సక్రమంగా వాటంతట అవే జరిగేటట్లు చూడటం తరవాత నా విధి.

ఏం వ్రాయగలను? ఇంకేం వ్రాయాలి ఇంతకు మించి? మొట్టమొదట సారిగా వ్రాస్తున్నా, భవిష్యత్తంతా ఏవేవో చెప్పాలని ఊహిస్తూ, ఊహా సౌధాలు నిర్మిస్తూ. ఇంతటితో ఆపేస్తాను ఈ వేళటికి.

మీ జవాబు కోసం వ్రాత పూర్వకంగా 'నయినా—నా కంటే ధైర్యశీలురు కనక నోటితోనయినా తప్పకుండా ఇస్తారన్న నమ్మకంతో నిరీక్షిస్తూ ఉంటాను.

—రవి."



పేరు క్రిందుగా ఉన్నఇంటి అడ్రెసు మరో మాటు చదువుకుంది సీత. ఉత్తరం పూర్తికాగానే సాయంత్రం లైబ్రరీలో కలుసుకున్న రవి మళ్ళీ మనస్సులో మెదిలాడు.

". . .క్షమించండి ( అదేం అల వాటు ఎల్లప్పుడూ? అనుకుంది సీత మళ్ళీ.) ఒక ఉత్తరాన్ని నిష్కల్మష మైన హృదయంతో వ్రాసినా, నీచంగా అర్థం చేసుకుంటారని ఊహించ లేక పోయాను. మీ మనస్సుని నొప్పించి ఉంటే మాత్రం మన్నించండి. సమాధానం రాలేదు. వస్తుందనుకున్నాను. పోనీలెండి. మీ సమాధానం 'కాదు' అని కాకుంటే మాత్రం రేపు సాయంత్రం లోగా మీ నిర్ణయాన్ని తెలియజేయండి."

కొంచెం సేపు గుక్క తిరగకుండా చెప్పకపోయినా ఆగి, అతనే మళ్ళీ "తొంద రెందుకంటారేమో? పరీక్షల దృష్ట్యా కాదనను కాని, మంచి ముహూర్తాలేదో ఉన్నాయంటూ ఏదో సంబంధాన్ని కుదిర్చేశారు మా వాళ్ళు—నా అభ్యంతరం ఉండదని. కాని, నా అభిప్రాయాన్ని స్పష్టంగా విన్న తరవాత వాళ్ళు నన్ను కాదనరని నా నమ్మకం. మీ నిర్ణయిం వేరే విధంగా ఉంటే. . .నా ఇష్టాయిష్టా లతో నేనే రాజీ పడి, వాళ్ళు నిశ్చయించిన సంబంధానికి తల ఒగ్గటం తప్పదను కుంటాను మరి. దానికి మించి నాకూ తొందరేం లేదు సుమండీ" అని వెళుతూ వెళుతూ, 'మీ నిర్ణయం నాకు తెలియ పరుచుతారు కదూ?" అని కనుమరుగయే రవిని చూసి అనుకుంది సీత: 'రవి నీ కా ధైర్యం లేదని అంటావు. నీ సంగతే కాదు, నా గురించి మాత్రం నువ్వేం ఊహించావు గనక?'

రవి. . . అవును, రవి. . . తను కావాలనుకుంటే, తన రవి. . . అందంగా ఉంటాడు. అందానికి మించిన గుణం, మంచితనం. ప్చ్! ఎందుకా పిచ్చి వర్ణనలు? రవి కంటే ఏ విధంగా నయినా ఉన్నతుడిని తన భర్త స్థానంలో ఊహించు కోగలదా? ఆ అవకాశం లభించినా, రవి కే విధంగా అతను తూగగలడు? అసలు అంతటి ఉన్నతుడు మరొకడు మరో విధంగా నయినా తన జీవితంలో తారసిల్లాడా? అ దసలు సాధ్యమా?

తనను చూసి తనే గర్వపడింది సీత.

# అగ్నిజ్వాలా తోరణాలు

పనిచెయ్యడం మానివేసిన వయసు చెల్లిన
పాత యంత్రాల నట్టుల తుప్పు వదిలించడానికి
మట్టితో పూడుకుపోయిన ఏటి కాలువలలో
మెరకలు తవ్వించి నీటిని పారించడానికి
మెస్సుగా తిని మస్తుగా ఫైళ్ళలో గుర్రుపెట్టి
నిద్రపోయే అధికారుల అనారోగ్యానికి
మందు కనిపెట్టి వైద్యం మొదలెట్టడానికి
చదువుకోసం అని చెప్పి చిన్నారి జడలతో
పడకలతో జాలుంచేసే రోడ్ రోమియోల
మెదడుకు షాక్ ట్రీట్‌మెంటు చేయించడానికి
చదువూ సంధ్యా లేకుండా ఆస్తి పాస్తి లేకుండా
లక్షలు సంపాదించి అధికారాన్ని ఒంటికాలిమీద ఏలుతూన్న
చీకటి ప్రభువుల భరతం పట్టి భరతవాక్యం పలికించడానికి
సత్యం చేతిలో త్రిశూలం నిలపాలి!
అసత్యం కళ్ళలో కారం కొట్టాలి!
శ్రమతో చెమటతో బాధ్యతతో
బీడులను పచ్చని బంగారు పొలాలుగా
తీర్చి దిద్దే కార్మికుని శక్తికి హారతిపట్టే
సమాజాన్ని ఆహ్వానించడానికి,
లేనివాడి అర్భకత్వాన్ని అలుసుగా తీసుకుని
పల్లకీలో కూర్చుని మోయించుకొనే వారికీ
తిండిని దాచి దారిద్ర్యాన్ని పెంచి
దేశాన్ని అప్రతిష్ఠపాలు చేసే
వినాయకుల బొజ్జలు కరిగించడానికి
అగ్నిజ్వాలా తోరణాలు ఆవిష్కరించాలి!
ఆకలి జ్వాలను సమూల నాశనం చేయాలి!!

—ఎల్లోరా

( అముద్రిత కవితా సంపుటి 'నిశ్శబ్ద తరంగాలు' నుంచి )

తన అదృష్టానికి తనే మురిసి పోయింది ఒక్క క్షణం. ఎటొచ్చీ సీతకు ఎంతగా ఆలోచించినా అర్థంకాని విషయం ఒక్కటే ఉంది మరి. నక్కకీ, నాగలోకానికీ ఉండేటంతటి తేడా స్పష్టంగా కనిపిస్తూ ఉన్నా, తనలో ఏం చూసి తనా నిర్ణయానికి వచ్చినట్లు? క్షణికోద్రేకానికి లోను కాలేదు కదా అతడు? ఈ ఆప్యాయత, ఈ ప్రేమ జీవితాంతం ఉంటాయా? ప్రశ్నలే కాని సమాధానాలు ఇప్పుడూ దొరక లేదు సీతకు. ఆ సాయంత్రం అతని కన్నుల్లో తనకి చూచాయగానూ, అస్పష్టంగానూ కనిపించిన విషయం మాత్రం 'రవి చెప్పే దంతా ముమ్మాటికీ నిజం' అని మొట్టమొదటి సారిగా అనిపించింది. కన్నె మనస్సులో రేగిన ఆలోచనా కెరటాలు పద్దు మణిగితే అటు వంటి భావం తప్పకుండా కనిపిస్తుం దని అనుకుంటాను. అదే కాకుండా ఉత్తరం చేరిన తరవాత, తనకు మళ్ళీ కనపడకుండా మాయమైన రవి, ఆ సాయంత్రం దీనంగా, అర్థించే విధంగా, అన్ని విషయాలు మాట్లాడిన తరవాత తనకు వేరే మార్గం కనిపించ లేదు.

చూచాయగా నిశ్చయించుకున్న విషయాన్నే ధృఢపరుచుకుని మనస్సుని గట్టి చేసుకుని అతనికి సమాధానం చెప్పవలసిన సమయం వచ్చేసింది కాబట్టి వేరే మార్గం లేదనుకుంది సీత.

కళ్ళు మూసుకుని క్షణం సేపు తెరిచి, ఏదో చేసేయాలన్న ధృఢ నిశ్చయంతో పేపరు మీద కలాన్ని పరుగెత్తించాలని అనుకున్నా, కలం కదల నని మొండి కేసినా కదలగా, నీలంగా మారిన వాక్యాలు కొట్టివేతలే కాకుండా చిన్న చిన్న ఉండలుగా పరుపు క్రింద పదిలంగా చేరినా, చివరి కెలాగయితే నేం?

"ప్రియమైన రవికి ( చదవగానే ఎక్కడా లేని సిగ్గు ముంచు కొచ్చింది.)

నేనూ నిశ్చయించుకున్నాను. కన్నె మనసు ఎగిరి గంతులు వేసినా, బాగా ఆలోచించాననే నా నమ్మకం. నా లోని కలవరం ఆలస్యానికి ముఖ్య కారణమయినా, మీరు మరోలా ఆలోచించేటట్లు చేసి (వందుకు మీరుకూడా నన్ను 'క్షమించాలి'. ఈ పదం వాడటం ఇష్టం లేక పోయినా రవికి ఇష్టం కదా అని కొట్టేయ లేదు ). 'ఇష్టమే' అని నేరే వ్రాయ వలసిన పనేముంటుంది? తక్కిన విషయాలపై మీ దృష్టి కేంద్రీకరించండి' అని నేను వ్రాసిన తరవాత మీకు వేరే చెప్పాలా? పరీక్షలయిన తరవాత వివాహం జరిగితే బాగుంటుందేమో కదండీ? మీ ఇష్టం.

ఎప్పటికీ మీ దానిగా ఉండిపోవాలని కాంక్షించే...

—మీ సీత."

ఉత్తరం పూర్తయింది. రవి వ్రాసిన దానికన్నా బాగున్నదని అనిపించింది. 'ఛీఛీ అదేం కాదు. నా రియాక్షను ఎలా ఉంటుందో ఊహించలే కుండా వ్రాసిన అతని ఉత్తరానికి, తన ఉత్తరం అతనిలో ఎంతటి ఉత్కంఠను లేపుతుందో తెలిసి వ్రాసిన తన ఉత్తరానికి పోలిక ఎందుకు ఉండాలి?" అనుకుంది సీత. అన్ని విధాల రవి తనకు మించిన వాడు. దాని వల్లనే కదా తన ఈ నిర్ణయం, ఆరాధన.

అడ్రెసు వ్రాసి, ఉత్తరాన్ని అంటించ బోయే ముందు... ఇంకా ఏదో వ్రాయాలనిపించింది సీతకు. టైమ్ చూసుకోగానే గుండె గుభేలుమంది. తను అంత చీకట్లోనూ, పక్క ఇంటి సరోజ దగ్గర ఏదో నోట్సు తెచ్చుకోవాలన్న మిషతో బయట పడాలి. చిన్నన్నయ్య తనూ వస్తానంటూ తనతో బయలు దేరకుండా ఉండాలి. అన్నా, వదినలకు తన సలు బయటి కెళ్ళినట్లే తెలియకుండా ఉండాలి. ఇవన్నీ సక్రమంగా జరగాలనుకుంటూ దేవుడికి దణ్ణం పెట్టుకుంది సీత.

చిన్నన్న ఏ కళలో ఉన్నాడో కాని అభ్యంతరం చెప్పలేదు. బ్రతుకు జీవుడా అని చీకట్లో నడవటానికి భయం వేసినా, రవిని తలంచుకునేటప్పటికి ఎక్కడ లేని ధైర్యం వచ్చేసింది సీతకి. ఉత్తరంతో పాటు రవికూడా 'స్లిట్ హోలు'కి 'కవరు' లేని పోస్టు డబ్బాలో పడేటప్పటికి, పిరికి తనం వెంట తరమగా, ఒక్క పరుగులో వచ్చి ఇల్లు చేరుకుంది సీత. వీధి చివర ఉన్న పోస్టు డబ్బా నుంచి. చేతిలో లేని పుస్తకం సంగతి చిన్నన్న అడగనే లేదు.

• • •

## కథకుడు

సినిమా నుంచి తిరిగి వచ్చిన దంపతులకు సీత ఆ రోజు ఎందుకంత త్వరగా గదిలో లైటార్పేసి నిద్ర పోయిందో అర్థం కాలేదు. వీధి చివర ఉన్న డొక్కు పోస్టు డబ్బాలో ఉత్తరం వేసేయగానే . . . పెళ్ళి రోజు గురించో, మొదటి రాత్రిని ఊహించో తీపి కలలు కంటూ, మంచంపై ఊరకే అటూ ఇటూ నిద్ర రాక దొర్లే సీతకు ఈ రోజుకీ ఎప్పటికీ పట్టని ఎదురింటి సంగతి, మీ కక్కర లేదనుకుంటే తప్ప నేను చెప్పే తీరతాను మరి.

• • •

సరిగ్గా సీత ఇంటి కెదురుగానే మరో మేడ. ఎటొచ్చీ ఇది కొత్తది. అదీ ఈ నాడా, రేపా నేను కూలేది అనిపించేటంత శిథిలావస్థలో ఉంది... అంతే కాదు తేడా. పేరు కది మేడ. కూలే గోడల్ని ఆపటాని కన్నట్లు, పైన చిల్లుల మయమైన రేకుల కప్పుతో పిలవబడే ఒక్క చిన్న స్టోర్ రూమ్. ఒక్కగానొక్క చిన్న గదిని తప్పించి, దాన్ని మేడని అనలేం. దానికి తలుపులు సరిగ్గా పడవు. కిటికీలా అసలే లేవు. నేలను చూద్దామా—కన్నాల మయం. పైన వేలాడే గబ్బిలాల విసర్జనల ఘోరమైన వాసన. ఎటూ వెళ్ళలేని సిగరెట్ పొగ, గబ్బిలాల కంపుతో కలిసిపోయి వింత వాసన నిత్యం పీల్చగల స్తోమతు ఒక్క 'కరుణ' లేకపోతే 'సాగర్'—ఆడవాళ్ళకు ఒక పేరుతోనూ, మగాళ్ళకు మరో పేరుతోనూ, కన్నవారికి 'కరుణాసాగర్' గానూ చలామణి అయ్యే వ్యక్తికి మించి ఎవరి సాధ్యమూ కాదు.

స్టోరులో పెట్టవలసిన వస్తువులు ఏ నాడో హరించుకు పోయినా, మహా సంసారాన్ని ఈదగల బాధ్యత ఇంటాయన రామస్వామి ఒక్కడి చేతుల్లోనే ఉంది. కాబట్టి, ఆపై గదిని అద్దె కిద్దామని ఎంత ప్రయత్నించినా, స్టూడెంటు పేరుతో చలామణి అయ్యే సాగర్ తప్ప మరెవ్వరూ కనిపించ లేదు పాపం! ఆయనికి. ఏ నాడో కాని కొన్ని నెలల అద్దె మొత్తాన్ని వాయిదాల మీద కాని తీర్చ లేని సాగర్‌ను వెళ్ళగొట్టాలని నిశ్చయించుకున్నా, వచ్చేవాడు మరో వాడు ఉండడని మాత్రమే కాదు అతను ఆ పని చేయలేకపోవటానికి! స్టూడెంట్ కాని స్టూడెంట్ సాగర్ గురించి ఎన్ని చెడ్డ కథలు విన్నా, పై కారణం వల్ల మాత్రమే అతన్ని చాలా నెలలు సహించ

గలిగాడు. ఏమయిందో ఏమోగాని, ఈ మధ్య ఇంటి ఓనరు రామస్వామికూడా కసురుకోవడం, పై పెచ్చు ఇల్లు ఖాళీ చేయించేస్తానని బెదిరించటం ఆశ్చర్యం గానే అనిపించేది స్టూడెంటు, స్టూడెంటు కాని సాగర్‌కు.

కన్నవారికి స్టూడెంటు. డబ్బులు నెలా నెలా ఠంచనుగా పంపే అన్నగారికి బుద్ధిమంతుడు. ఆడవారికి ప్రేమికుడు మొదలు రోమియో వరకు. అప్పుల వాడికి ఏదో విధంగా అప్పు పట్టుకోగల సమర్థుడుగానూ, వీడిని చూస్తే ఎక్కడ అప్పడుగుతాడో అనే భయం తోనూ, అప్పుగా ఇచ్చిన రొక్కానికి తిలోదకాలు వదులుకోవాలసిందే కాబట్టి అదికూడా ఒక కారణంగానూ, ఇంకా అనేకులకు అనేక రకాలుగా చలామణీ అయ్యే స్టూడెంట్ సాగర్ పేరు కాలేజి రిజిస్టర్ నుంచి, మ్యునిసిపల్ ఛెయిర్మన్‌గారి కూతురు ఛాయాదేవి జడ, క్లాసురూమ్‌లో ఆమె వెనగ్గా కూర్చుని అతి నేర్పుతో కత్తిరించి సవరాలు చేసేవాడికి అమ్మిన ఘనుడుగా గుర్తించ బడగానే, డిస్మిస్, అయిన ఫలితంగా పేరు తొలగించారు. ఈ కాలేజి చదువులు చేతకాని వాడికే లేవోయ్, నా లాంటి సమర్థులకు కాదని మరో కాలేజిలో చేరటం మానేశాడు సాగర్‌కూడ.

అన్న పంపే డబ్బు అతని సిగరెట్టు ఖర్చుకు సరిపోదు. మొదటి తారీఖు జీతం దొరకగానే తప్ప త్రాగి తూలే నాలుగో తరగతి ఉద్యోగిలా అప్పు దొరికిన రోజు తూలిపోయే కరుణ—స్కూటర్లో వెళుతూ ఒక రోజు, కాలినడకన మరో రోజు, ఎనిమిది వందలకు తక్కువ కాని



ధగధగ మెరిసే వాచీతో చేతులు ఊపుకుంటూ ఒక రోజు, మొండి చేతులతో చేతులు ఊపకుండా మరో రోజు కనపడటంలో అతని స్థితిగతులు, అంచనా వేయగల సామర్థ్యం ఎవరికీ ఆ ఊరిలో లేదు. అయితే, ఎటొచ్చీ అప్పు చేసిన దానిలోంచే చిన్న మొత్తాన్ని పాత అప్పుల కోసం జమ కడుతూ ఉంటాడే కాని, వాడి ముఖం వాడేం ధనవంతుడండీ అన్న పుకారులేకపోలేదు. కుబేరుడి దత్తపుత్రుడివని చాటి చెప్పుకునే సాగర్ మాటలతో బోల్తా పడిన వారే ఎక్కువ మరి.

కరుణ మాయలో పడి మేరీ గర్భవతి అయింది. మరేం ఫరవాలేదంటూ, ఏదో చిట్కా మందు తినిపించే సరికి చావు తప్పి కన్ను లొట్ట బోయిన ఆమె, తల్లిదండ్రులననుసరించి ట్రాన్స్ఫరయిమరో ఊరు వెళ్ళిపోయినా, ఏ నాటికో ఒకనాడు వీడే ఉద్ధరిస్తా డనుకుంటూ ఉంటుంది. అంతేకాని, వీడు చేసింది మోసం అంటే వస్తే నమ్మదు.

అరచేతిలో స్వర్గాన్ని చూపించిన జలజకు రాను రాను రోజు రోజుకూ పెరుగుతున్న కడుపులో తప్పక, ఏదో ఒక బల్ల ఉంటుందని నమ్మి డాక్టరుకి చూపెట్టే, అది బల్ల కాదు—పిల్ల అని తెలుసుకున్న పానకాలు ఉద్రేకంలో బుర్ర చితక గొట్టి, ఫలితంగా జైలు శిక్ష అనుభవిస్తూ, అక్కడ ఉండే కటకటాలకు తలను బద్దలు కొట్టుకుంటూ తన ఖర్మకు, బల్లకు కారకుడు సాగరని మాత్రం ఈ నాటికి తెలియదే! ముందే తెలిస్తే ఏ మయ్యేదో పాపం?

ఏ దేమైనా కరుణ ఆటలు ఆట్టే కాలం సాగలేదు. పాపం ఏనాటికయినా బయట పడుతుందన్న సామెత బుజువయింది అతని విషయంలో. ఉన్నట్లుండి అప్పెక్కడా పుట్టక పోవడం కరుణ చూసిన మొదటి నరకం. పైగా అప్పుల వాళ్ళంతా ఒకేసారి దండెత్తు కొచ్చారన్నట్లు వీధిలో ఎవడు వీడిని చూసినా, అణా పైసలతో సహా వడ్డీ దేవుడెరుగు అసలు కక్కమని నిలదీసి అడగటం—కొన్ని సార్లు నోటిమాటగానూ, ఒకటి రెండు సార్లు చేతితోనూకూడా గట్టిగా మందలించటం జరిగింది.

వీటి ఫలితమా అని, రాజాలా బతుకుతున్న గదిని వదిలి పెట్టేసి, ఎవరికీ పనికిరాని రామస్వామిగారి స్టోర్‌రూమ్‌లో చేరటమే కాకుండా, వీధిలో సాధ్యమైనంత వరకు కనిపించటమే మానేశాడు. రామస్వామికి సాధ్యమైనంతవరకు తెలియకుండా ఇంటికి వచ్చే మనిఆర్డర్లను పుచ్చుకున్నా, అన్ని పంపించే ముష్టి మొత్తం అతనికి ఏ మూలా సరిపోయేది కాదు. కరుణ కొన్ని నెలలుగా ఆ దయ్యాల గదిలో ఉంటున్నా, అతని ఉనికిని కొంతమంది ఇంకా కనిపెట్టలేక పోయారు. 'చచ్చాడులే శని పీనుగ' అనుకుని బాకీకి తిలోదకా లిచ్చేశారు. లేకపోతే మరీ కష్టంగా ఉండేది వాడి మారిన జీవితం, ఆ చాలీ చాలని డబ్బుతో.

ఆ రాత్రి గదిలో మసక చీకటి. అయిపోబోతున్న కిరోసిను సంగతి గుర్తు చేస్తూ, దూరంగా ఒక మూల నుంచి మిణుకుమిణుకు మనే గుడ్డి లాంతరు. పరికించి చూస్తూ, చాపపైన పక్కకు కదలబోయే టప్పటికి, శరీరంలోని ఎముకలన్నీ ఊడి చాప మీద పడ్డంత నొప్పి పుట్టింది. పొరపాటున వీధిలో కనబడిన దానికి అప్పుల వాడి బహుమానం సాధ్యమైనంత చావ చితక కొట్టి మరీ వదిలాడు.

ఏ మూడ్‌లో ఉన్నాడో ఏమో కాని ఇంటాయన రామస్వామికూడా—'రేపు పొద్దున్న అద్దె చెల్లిస్తావో లేక నీ చాపా, చెంబూ బయటి కీడ్చి గదికి తాళం వేయమంటావో నీవే తేల్చి చెప్పు' అని నిక్కచ్చిగా ఆ గదికి తాళం వేసే ఏర్పాటు లేదనికూడా మరిచిపోయి మరీ గట్టిగా మందలించాడు.

మొట్టమొదటిసారిగా కాకపోయినా, ఈ సారి నిజంగానే మరింత ఎక్కువగానే బాధ పడ్డాడు కరుణ. ఈ మధ్య అతనికి జీవితమంటేనే విరక్తి ప్రారంభమయింది. ఆ రాత్రి అది మరింత బయట పడింది. కనుగొలకుల్లో నిలిచిన నీటిని చూపుడు వేలుతో తుడిచి విదుల్చు కుంటూ ఉండగానే ఒకరి వెంట మరొకరు మేరీ, జలజ, ఛాయ, బడితపూజ చేసిన అప్పులవాడు, ఇంటాయన రామస్వామి మరుసటి రోజు ప్రొద్దుటే ఇంటినుంచి నిర్దాక్షిణ్యంగా తరిమి కొట్టుతున్నట్లు ఫీలవగానే వణికి పోయాడు. ఒళ్ళంతా బాధ మళ్ళీ అనిపించింది.

'చాలు, భగవాన్! ఈ జీవితానికి ఈ శిక్ష చాలు. నరకాన్ని ఇక్కడే చూశాను. చచ్చిన తరవాత తిరిగి చవి చూచేదానికి 'స్పేరుగా ఇంకేం మిగల్చ కుండా చేసేశావు.'

తిండి రూపంలో ఏదైనా తిని రెండు రోజులు పైగా అయింది. నీరసం కాక మరేం మిగులుతుంది ఒంట్లో? దాహం వేసినట్లు అనిపించగానే మెల్లగా దేహాన్ని లాగుకుంటూ మూల మన్న కుండ దగ్గరికి వెళ్ళి చూడగానే, ఖాళీ కుండ సాగర్ని చూసి నవ్వింది. వెంటనే ఎక్కడా లేని నిస్సహాయత మరో మారు అతణ్ణి ఆవరించింది.

'అవున్లే. . . ఇస్తానంటూనే మూడు రోజులు జీతానికి ఎగనామం పెడితే ఆ పిచ్చిది ముత్యాలు మాత్రం ఏం చేస్తుంది గనక?' అక్కడక్కడ బాగా కాలిపోయి మరకల్ని ఏర్పరిచిన బీడీ ముక్కల్ని చూసి ఏడ్చే విధంగా నవ్వుకున్నాడు. అంతకు ముందు వాటి స్థానంలో అప్పుడప్పుడూ ఉంటూ వచ్చిన సిగరెట్టు పీకలు కనిపించలేదు అతని కంటికి.

కాళ్ళీడ్చుకుంటూ చాపను చేరి కూలబడే ముందు కాలికేదో కాగితం లాంటిది తగిలింది.

ఆశ్చర్యం! ఉత్తరం. అవును, ఉత్తరమే. బాగా పరిచయం ఉన్న దస్తూరితో వ్రాయబడి ఉంది సాగర్ అడ్రెసు. గుడ్డి లాంతరు దగ్గరికి లాగి వత్తి వీలయినంత పెద్దది చేసినా సరిగా కనిపించ లేదు అందులో వ్రాసిన విషయం. ప్రాణం లేచి వచ్చింది కరుణకు ఆ ఉత్తరం చూడగానే.

దాన్ని ఎవరు, ఎప్పుడు పడేశారో అసలే గుర్తు లేదు అతడికి. ఎప్పుడు వ్రాయబడిందో తారీకు చూసే ఓపిక కూడా అతనిలో నశించింది. 'పిచ్చన్నయ్యా! తన అడ్రెసు వ్రాసిన ఇన్‌లాండ్ జత పరిస్తే కాని, నా దగ్గిరి నుంచి జవాబు రాదని వాడి ఉద్దేశం. ఆ ఉత్తరాన్ని కొని వ్రాయగల పైసలుకూడా నాదగ్గర లేవని వాడి కెలా తెలుస్తుంది. కాలేజీ చదువులు వెలగబెడుతూ ఏదో పెద్దవాడవుతాననే తలపు తప్పించి, నే నెంత హీనస్థితికి దిగజారానో తెలుసుకుంటే వాడు తట్టుకోగలడా? కాదు. తప్పకుండా వాడు నన్ను క్షమించగలడు. తలుచుకుంటే నన్ను మళ్ళీ మంచి త్రోవలో పెట్టగల సామర్థ్యం వాడికి తప్ప మరింకెవరి కుంది? అవసరమన్నా అంతే.'

మళ్ళీ కంటి వెంబడి నీరు కారసాగింది. ఈ సారి తుడుచుకునే ప్రయత్నం చేయకుండానే ఆవేశంగా అనుకున్నాడు కరుణ: 'చెప్పాలి...అవును, వెంటనే వ్రాసేయాలి. కనీసం వాడికయినా నిజాన్ని చెప్పేయాలి. దేవుడి లాంటి అన్నయ్యను నే నింక మోసం చేయలేను. అది నా చేత కాదు. ఆ పాపం భరించలేను. వ్రాయాలి, నేను మారానని. మళ్ళీ ఇటువంటి పనులు చేయబోనని. నమ్ముతాడు. తప్పకుండా నమ్ముతాడు. నేను మారిపోయానని అనుకుంటాడు. అంతేకాదు. అన్నను అర్థిస్తే కాదనడు. వాడి దలాంటి మనసు కాదు. అప్పులు తీర్చి పారేయ్యాలి. ఇంటద్దె



కట్టేయాలి. మళ్ళీ అందరి ముందు తల ఎత్తుకుని తిరగాలి. వీలు పడితే మరో చోట ఏదైనా కాలేజీలో చేరి చదువు పూర్తి చేయాలి. వ్రాస్తాను. అవు నన్నా, నీకుగాక మరింకెవరికి రాయగలను?'

వెర్రి ఆవేశంతో ఊహించే కరుణ దేనికోసమో కళ్ళు సెర్చి లైటు లాగా పనిచేయగా ఆ మసక వెలుతురులో వెతికి చివరికి పట్టేశాడు. అది పెన్సిల్‌ముక్క. ఇంటాయన చిన్న కూతురు ఎప్పుడో ఆడుకుంటూ వదిలేసి పోయిన పెన్సిల్ ముక్క. ముక్కు సరిగ్గా లేకపోయినా, పెన్సిల్ చివరను దాన్ని కలిపి గట్టిగా వత్తుతూ ఏదో కొంచెం సేపు గిరికి, నోటితోనే దాన్ని అంటించేసి అనుకున్నాడు కరుణ:

•

'డబ్బు వస్తుంది. తప్పకుండా వస్తుంది. మహా అయితే అందేటప్పటికి ఒక వారం రోజులు అవుతుందేమో? ఇంటాయన పోరు తప్పాలన్నా, మరుసటి రోజు జరగబోయే అవమానాన్ని తప్పించు కోవాలన్నా తను ఈ వారం రోజులు ఎవరికీ కనపడకుండా మాయ మవ్వాలి' ... అనుకుంటూనే మెల్లగా శబ్దం కాకుండా ఇంటి బయట కొచ్చి, అటూ ఇటూ చూసి ఎవరూ లేరని నిర్ధారించు కుని, వీధి చివర పోస్టు బాక్సుని సమీ పించి ఉత్తరాన్ని దానిలో వేసే ముందు— 'భగవాన్! నీ దయ అన్న ద్వారా నా కందేట్లు చూడు. ఈ కుక్క బ్రతుక్కి ఇదొక్కటే ఆధారం. వారం రోజుల్లోగా పైకం అందకపోతే నాకు నిన్ను చేరే దానికంటే మరో ఆస్కారం లేదు. అన్నా! పంపిస్తావు కదూ? తప్పకుండా పంపిస్తావు కదూ? అయినా నా పిచ్చి గాని, నేను చచ్చిపోవటం కాదు గదా నువ్వు కోరేది? తప్పకుండా పంపిస్తావు.' ఉత్తరం వేయగానే ఏదో చప్పుడయితే త్వర త్వరగా చీకట్లోకి జారుకున్నాడు కరుణ.

• • •

కథకుడు


ఎవరా అనుకున్నా? ఎవరూ లేరు మరి ఆ చప్పుడేమిటి? ఓరినీ! ఈ చీకట్లో పదకొండు గంటల వేళ... ఆ చంటివాణ్ణి బాదుతూ ఇక్కడ కొచ్చే ఆ పెద్దమనిషి ఎవరబ్బా?

• • • !

దరిద్రపు వెధవా! కుర్ర పీనుగా ముండాకొడకా! నా కడుపున చెడ ...వురా! చెప్పు... చెప్పమంటూ ...? ఎక్కడ దాచావు?... అదే ... పారేశావ్. ఇంత దూరం నన్ను ...చ్చి, ఇక్కడ ఆగావేమిరా? ఇదా ఎవరూ చూడకుండా దాచటమంటే? ఒరేయ్! నాతో కాదురా, వెధవా, నేను నీ బాబున్నా! నీ మాట నేను నమ్ముతానా, పుండాకోర్! అసలు నిన్నని ఏం లాభం? దానికి ఉండాలి ఆ బుద్ధి. ఆ వెధవ ముండనే ఇంటి దగ్గరే రెండు తగిలిస్తే అక్కడే తేలిపోయేవి అన్ని విషయాలూ ఇంత దూరం రాకుండా..." మళ్ళీ వాణ్ణి రెండు తగిలించగానే, ముక్కు లోంచి కారేదాన్ని ఒక చేతితోనూ, జారే లాగును మరో చేత్తోనూ అపు కుంటూ, వెక్కి వెక్కి ఏడుస్తూ, "ఎవరైనా చూస్తాలని... మరేం... మరే... ఆ ఎర్ర పెట్టిలోనే... లోనే ...పాలేశా" అంటే ఇంకేమి చెపుతున్నా డని ఎదురు చూస్తున్న ఆ ఆసామి చివరగా మరొకటి తగిలించి, "ఒరే నక్కా! వేలెడంత లేవు. నీ కెంత తెలివిరా! దాని కడుపున పుట్టావ్‌గా. ఉంటుందిలే పప్పు తెలివి. అయినా, ఆ పెట్టె నీ కెలా అందింది? అందినా ఆ సీసా దానిలో కెట్లా దూరింది? ఇదో డొక్కు డబ్బా కదా నా ప్రాణానికి. ఏమయితే నేంలే. పదరా, వెధవా, ఇంకా ఆ చూపులెందుకు? చేసిన నిర్వాకానికి తోడు!" అంటూ కోపంతో రెక్క పట్టుకుని లాక్కొచ్చే తన భర్తని, అదే పనిగా భోరున ఏడు స్తుండే కొడుకుని మార్చి మార్చి చూస్తూ, ఇద్దరి చేతిలోనూ, తను భద్రంగా ఎక్కడైనా దాచి పెట్టమని తన భర్త ఇంట్లో పెట్టిన విస్కీ సీసా కనిపించక పోయేటప్పటికి చిరునవ్వు ముఖంపై చిందించే టప్పటికి ఉక్రోషం పట్టలేని భర్త 'ఫెడీలు' మని చెంప వాయించే టప్పటికి ఆమె కళ్ళలో నీరు తిరిగింది.

"పాపిష్టిదానా! నీ వల్లనే కదా ఇదంతా? విన్నావా నీ సుపుత్రుడి ఘన కార్యం? చూసి రమ్మంటే కాల్చి వచ్చే వాడిని కన్నందుకు గర్వ పడవే! గర్వపడు. ను వ్వెక్కడో దాచి రమ్మంటే... దానవాదులకికూడా తెలియని స్థలంలో... ఏదీ ... ఆదే ... గవర్నమెంటు వారి పోస్టు డబ్బాలో ఉత్తరాలకి ఎండా నీడా కనిపించకుండా చేస్తూ ఉండే... ఆదే... వీధి చివర పోస్టు డబ్బాలో వేసి మరీ వచ్చాడు నీ కొడుకు..."

ఇంటి గుమ్మం ముందు దాటుతూ మళ్ళీ వెనక్కి వచ్చి, "నీ కొడుకు ప్రతాపా నికి సంతోషిస్తే చాలదే. ఇదికూడా విను మరి. స్టైవ్ ఇంతయుంది కదా అనుకుంటున్నావేమో? ఉంటాయే... ఇంకా ఉంటాయే నా లాంటి వాళ్ళ కోసం... పెద్ద సీసా కొనుక్కుని కసిదీరా తాగి కాని ఇంటి గడప తొక్కనే ... అ... ఏమనుకున్నావో.' త్రాగే



ఇదో వృత్తి చిత్రం—కె. ఎస్. వి. ప్రసాద్‌బాబు (కాకినాడ)

చాణుక్యుడి పిలక వాడితో పాటు ఊగుతూ ఉండగా వాడి లోకానికి వెళ్ళిపోయాడు ఆ చీకట్లోనే.

• • •

కథకుడు

అదే రాత్రి. సుమారు పన్నెండు గంటల వరకు అయి ఉంటుంది సమయం. నిద్ర పోవాలనుకుని ఉపక్రమించబోతే, సినిమానుంచి ఆలస్యంగా వచ్చిన షోకిల్లా రెడ్డి తీరికగా భోజనం ముగించినా, ఇంకా నిద్ర పోబోయే సూచన కనిపించ లేదు అతడి ఇంట్లో వెలిగే లైట్లు కనిపిస్తూంటే... నా దృష్టి నటు మరల్చాను.

• • •

"నీ కిదేం పిచ్చిరా, తలచుకున్నప్పుడే తాత పెళ్ళని! పొద్దున్నే వేద్దు గానిలే ఆ వెధవ ఉత్తరం. పొద్దు పోయింది. నిద్రపో. ఆరోగ్యం దెబ్బ తింటుంది." అగ్గిపెట్టె జేబులో వేసుకోబోతూ అమ్మ గొంతు విని తత్తరపాటు చెంది, రెండూ భద్రంగా—అంటే అగ్గి, సిగరెట్టు, పెట్టెలు జేబులోనే ఉన్నాయని నిర్ధారణ చేసుకుని 'ఇంకా నయం, నిద్రే కాదు, సిగరెట్ల గురించి తెలిసిం దంటే ఆరోగ్య సూత్రాల్ని అమ్మ ఇంకెంతగా వల్లె వేస్తుందో' ననుకుని.

"అదీకాదే, అమ్మా! నే నా పుస్తకం చదువుకుంటూ ఇంకో గంటకు కాని నిద్ర పోనా? లేచేటప్పటికి బారెడు పొద్దు పోతుందా. మొదటి పోస్టు తెల్లారి ఏడు గంటల కల్లా తీస్తాడా? పోనీ, పొద్దున్న వేస్తాడులే అనుకోవటానికి సమయానికి రాముడుకూడా లేడా? ఇక నువ్వు చెప్పు—ఈ ఉత్తరం పొద్దుటి ఫస్టు పోస్టుకి ఎలా వెడుతుందో? పోతే ఉత్తరం చూద్దామా అంటేను అర్జెం టాయె!" అని మళ్ళీ ఇంకే విషతో నయినా అడ్డు పడుతుందేమో ననుకుని, ఆ ఛాన్సు ఇవ్వకుండా బయట పడి, సిగరెట్టు అంటించ బోయే సమయంలో

"ఏమిట్రా, పెద్ద రెడ్డీ! తిన్న అన్నం షికారు కొస్తే కాని, అందులోనూ అర్ధరాత్రి పూట అరగదా ఏం?" అని వినపడడంతో పరిచయమయిన గొంతు కావటంతో మళ్ళీ రెంటిని జేబులో కుక్కేసి వెనక్కు తిరిగి, "ఓసి నువ్వటే, బాబాయ్! ఏమీ లేదు ఈ ఉత్తరం అర్జెంటు. మళ్ళీ నేను పొద్దున్నే లేచి ఉత్తరం వేయగలనో, లేదోనని దీన్ని పోస్టుడబ్బాలో పారేద్దామని వచ్చా. అంతే. పిన్ని వాళ్ళూ కులాసాయేనా?" అన్నాడు రెడ్డి ని ఆయన పోస్టు డబ్బా వరకు వదల్లే లేదు.

ఆయన వెళ్ళగానే, ఉత్తరాన్ని పోస్టులో నయినా వేయకుండా 'రామేశ్వరం వదిలినా శనేశ్వరం వదల లేదని. . . నేను ఇంట్లో పిల్లేదు గదా అని ఈ ఉత్తరం సాకుతో బయట పెడితే మధ్యలో వీడొకడు రామాయణంలో పిడకల వేటలా' అనుకుని, సిగరెట్టు నోట్లో పెట్టుకుని వెలిగించి దాన్ని ఆర్పనన్నా ఆర్పకుండా విసురుగా పారేసేటప్పటికి, అది కాస్తా స్లిట్‌కు కవర్ లేని ఆ పోస్టు డబ్బాలో పడటం వెంటనే దాని లోనుంచి ఏదో కాంతి రావటం, కాగితం కాలిన వాసన, మొదలైన దేదో పసిగట్టగానే. . . చేతిలోని ఉత్తరాన్ని జార విడుచుకున్నా లెక్క చేయకుండా ఒకటే పరుగు, రెడ్డి.

• • •

కథకుడు

అందరికీ కాకపోయినా కొంతమంది కయినా తెల్లవారింది మరుసటి రోజు. పొద్దున్నే సరిగ్గా ఏడు గంటల కల్లా తాళం వేసి ఉత్తరాలను సంచిలో వేసుకో బోయిన పోస్టుమన్ ఖాసిం ఒక్కసారి అదిరి పడ్డాడు. తరవాత పై అధికారులకి రిపోర్టు, పోలీసుల్లకు వర్తమానం అంద జేయటం తన విధిగా అనుకున్న పోస్టు మేస్టరిగారి పని పూర్తయింది.

వారం. . . అవును. . . ఎంత సేపట్లో గడిచిపోతుంది? ఒక రోజు మధ్యాహ్నం—

• • •

సరోజ గొంతు విని పరధ్యానంగా ఉన్న సీత ఉలిక్కి పడింది.

"చూశావా, సీతా? నీ ముఖంలే అదీ అనుమానమే. . . సన్నగా, పొడుగ్గా ఉండేవాడే ఆ ఎదురింట్లో. వాడినే రోమియో అనే వాళ్ళం. ఇప్పటికి జ్ఞాపకం వచ్చిందా? ధన్యురాల్ని సుమా! అస లే మయిందో తెలుసా?"

ఏ చలనమూ లేకుండా తననే అలా చూస్తుండే సీత దగ్గరి నుంచి ప్రశ్నల రూపకంగా సంభాషణ అలవాటులేని సరోజే అంతా చెప్పటానికి నిశ్చయించు కుంది.

సత్యస్వరూపుడుగా కనుపిస్తూ అసత్యాన్ని తొలుదొల్త ఆచరణలో పెట్టినవాడు షైతాను.

—మిల్టన్

• • •

కష్ట నష్టాలు ఎన్నిటినో తనలో ఇముడ్చుకొని ఉన్న బలహీనత సోమరితనం.

—రిక్టర్

• • •

అబద్ధం చెప్పిన వ్యక్తికి మంచి జ్ఞాపకశక్తి ఉండడం ఎంతైనా అవసరం.

—కార్లైల్

---

"ఏమిటా వెధవ చూపూ, నువ్వూ? వాడు చచ్చాడట. చావులోకూడా ఘోర మైన చావనుకో అస లేమయిందంటే— ఒక వారం రోజుల్నించి కనిపించని వాడు పారిపోయాడని వాళ్ళంతా అనుకుంటూ ఉంటే అమాంతంగా ఈవేళే ఎక్కణ్ణించో ఊడి పడి, రామస్వామిగారిని నిలదీసి అడిగాడట— మనియార్డరు వచ్చిందా? అని. మళ్ళీ వీడేదో కొత్త ఎత్తు ఎత్తాడని అనుకున్న ఆయన కసిరి కొట్టేటప్పటికి, రామస్వామి గారే డబ్బు కాజేశారని నానా అల్లరి చేసి, పెద్దమనుష్యులు జోక్యం చేసుకుని అదేమి లేదని చెప్పగానే. . . 'అన్నయ్య అలా చేయడు . . . చేయడు' అని పిచ్చివాడిలా అరుచుకుంటూ పరుగెత్తి పోయి, ఆ సమయానికి వస్తున్న కలకత్తా మెయిలు కింద తల ఉంచి ఘోరంగా ఆత్మహత్య చేసుకున్నాడట." కొంచెం సేపు ఆగి మళ్ళీ తనే అంది సరోజ: "ఇంత గొడవ జరిగినా నీ కేం పట్టనేలేదటే! పూర్ ఫెలో! ఒకప్పుడు మన కాలేజి స్టూడెంటుకూడా కాబోలు. . ."

ఏదో చెప్పబోతూ ఉంది ఇంకా. ఇంతలో—"ఏమండీ!" అని వినిపించటం తోనే సీత కళ్ళు విప్పారాయి. తను ఎదురు చూస్తున్న, తను వినాలని తహ తహ లాడే గొంతే అది. అబ్బ! మరుసటి రోజే వస్తాడని. రెక్కలు గట్టుకుని వచ్చి వాలతాడని ఎదురు చూసిన రవి. అమ్మయ్య! ఇన్నాళ్ళటి కన్న మాట!

"సీతగారే కాదే. . . సరోజగారూ ఇక్కడే ఉన్నారన్న మాట!అయితే, నా పని సులభమే అయిందన్న మాట. లేకపోతే వాళ్ళింటికికూడా వెళ్ళాలని అనుకున్నా... ఏమిటండీ, సీతగారూ, వీళ్ళెవరనా? ఆయన మా ఫాదర్. . . పక్కనున్నది మా అమ్మగారని వేరే చెప్పాలా? నా పోలికలే కదూ?" నవ్వుతూ అంటూ ఉన్నా, మరీ 'గారూ' అని ఇంకా తనను సంబోధించటం సీతకు నచ్చలేదు. అది ఆలోచించే లోపలే—"మాట మాత్ర మయినా చెప్పలేదు వాళ్ళిద్దరితో మీ రొస్తున్నారని. అన్నయ్యా, వదినా బజారు కెళ్ళారు. చిన్నన్నయ్య కాలేజీ కెళ్ళాడు... మీరు వస్తారని తెలిస్తే ఈ పొరపాటు జరిగేది కాదు. అయినా, వస్తూ ఉంటా రేపటికి. అరే, నిలబడే ఉన్నారే! కూర్చోండి. సరోజా! ప్లీజ్ హెల్ప్ మీ. . .వారికి కాఫీ వగైరా. . ." అంది.

మాటను మధ్యలో తుంచేస్తూ రవి— "నో, నో! అదేం పెట్టుకోకండి ఇప్పుడు. వాళ్ళు ఊరి నుంచి రాగానే మిమ్మల్ని చూస్తామంటే బాగున్నా, లేకపోయినా ఉండబట్టలేక తీసుకొచ్చేశాను. ఇంతకీ అసలు సంగతి మరిచే పోయాను. చూడండి, సీతగారూ! ఇది మీకు స్పెషల్గా మీ కొకరికే ఇది మీ ఫామిలీ మెంబర్సుకి. సరోజగారూ! కోప్పడకండి. ఇదేమో మీ అందరికీనూ" అంటూ చేతికి ఇచ్చిన ఇన్విటేషన్సు వెంటనే తీసి చూసిన సరోజ—

"కంగ్రాట్స్, రవిగారూ! చెప్పరేం? ఊరక రారు మహాత్ములు అనుకుంటూనే ఉన్నా. వెంకటసుబ్బమ్మా! అబ్బెబ్బే! ఇదేం పేరండీ, బాబూ!" అని వెంటనే నాలుక కొరుక్కుంటూ, "సారీ. . . సారీ! పేరులో ఏముంది లెండి. తప్పకుండా వస్తాం పెళ్ళికి. ఆఁ. . .గ్రాండ్ రిసెప్షన్ ఇవ్వాలి మన కాలేజి కుర్రాళ్ళ కంతా. . . ." అంది. సరోజ ఇంకేం చెబుతుందో కూడా తెలియలేదు సీతకు.

"అమ్మాయి లక్ష్మీదేవిలా ఉంది. మనకే ఆ ప్రాప్తి లేదు" తండ్రి అంటూ ఉంటే—"ఉష్! వాళ్ళు వినగల" రని హెచ్చరిస్తున్న తల్లిని చూసినప్పుడు గుండెలో ఏదో ముల్లు గుచ్చుకున్న ట్లయింది వెళుతూ ఉన్న రవికి. అక్కడి నుంచి ఇవేవీ సీతకు వినిపించ లేదు. వినిపించవుకూడా.

సీతకు కొన్ని జన్మ లెత్తినా అర్థం కాని విషయాలు రెండే. తనలో ఏం చూసి తనను కావాలనుకున్నాడు రవి? దేన్ని చూసి మళ్ళీ వెనక్కి జారిపోయాడు?

ఏమో. . . ఏమో. . . ఏమో. . . ఏమో? ? ?

• • •

కథకుడు

ఇది ఎవరి సంగతో? దీన్నిగూర్చి ప్రభుత్వాని కక్కర లేదు. దానికి కావల సింది విచారణ.

ఎంక్వయిరీ కమిటీ ఏర్పడింది. దాని సారాంశం: "కొన్ని అనివార్య కారణాల వల్ల లోపభూయిష్టమైన పోస్టు డబ్బాను తొలగించి వేరే ఏర్పాటు చేయవలసిన బాధ్యతను పోస్టల్ డిపార్టుమెంటు నిర్వర్తించలేకపోయినా, కొన్ని సంఘ విద్రోహకరశక్తులు ఒక స్పిరిట్ సీసాను దానిలో సులభంగా వేయగలిగి, అగ్గిపుల్ల ద్వారా తగల బెట్టడంలో సఫలీకృతు లయ్యారు. ఇది యావత్ భారతజాతి గర్వించ దగిన విషయం.

తెలిసినంతవరకు, ఏ ముఖ్యమయిన ఉత్తరం విధ్వంసం కాలేదని మాత్రం చెప్పవచ్చు. పోస్టు డబ్బాలో ఆ రోజున అదృష్టవశాత్తు అయిదు ఉత్తరాలు మాత్రమే పోస్టు చేయబడ్డాయి.

వీటిలో రెండు పూర్తిగా కాలి పోయాయి. పాక్షికంగా తగలబడ్డ మూడు ఉత్తరాలు పెళ్ళి ఆహ్వాన పత్రికలు. మిగతా రెండింటి గురించి ఆచూకీ తెలియలేదు. అవి ప్రభుత్వాని సంబంధించిన ఉత్తరాలు కావడానికికి ఆస్కారం లేదు. ఏ ఆఫీసూ దగ్గర లేకపోవ టం వల్లనూ, దర్యాప్తు వల్ల ఆ రోజు ఆ డబ్బాలో ఏ ఉత్తరమూ వేయబడ లేదని ఋజువయింది, ఇతర ఆఫీసుల నుంచికూడా.

ప్రజల వద్దనుండికూడా విలువైన ఉత్తరాలు ఆ డబ్బాలో పోస్టు చెయ్య బడ్డట్లు ఆధారాలు లేవు.

ఏ దెలాగున్నా, కమిటీ—జరిగిన దానికి చింతిస్తూ, ఇక మీదట అటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని, వాటిని అరికట్టాలని ప్రతి పోస్టు డబ్బా దగ్గర వీలయిన పక్షంలో ఒక సాయుధ రక్షకభటుడిని నియమించాలని, ప్రజల నుండి వాలంటీర్లను నియమించా లని ఏదేదో, మరేదో. . ."

కమిటీ వారి రికమెండేషన్లు ఏమేమీ ఉన్నాయో మన కెందుకు కాని. . . మరుసటి రోజు పొద్దున్న కల్లా నిగనిగ లాడే సరి కొత్త పోస్టు డబ్బా, ద్వార పాలకుడులా ముచ్చటగా కనిపించింది వీధి చివరలో. ★